జిల్లాలో నేడు

కందుకూరుకు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కందుకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు శనివారం రానున్నట్లు మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11.40 నిమిషాలకు మంత్రి విచ్చేసి రూ.17 కోట్ల నిధులతో మండలంలోని దెబ్బడ గూడ, కొలన్‌గూడ, గఫూర్‌నగర్, జైత్వారం గ్రామాలతో పాటు నేదునూరు జెడ్పీ రోడ్డు నుంచి మద్దెల కుంట తండా వరకు బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు.



చేవెళ్ల డివిజన్‌లో పాఠశాలలు బంద్

చేవెళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాంస్థలను బంద్ చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ తెలిపారు. శుక్రవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. విద్యా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ధాన్యం రాక వెలవెలబోతున్న కేశంపేట కొనుగోలు కేంద్రం

ధాన్యమేదీ?

కొనుగోలు కేంద్రాలకు చేరని వడ్లు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక వెలవెలబోతున్నాయి. వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని సర్కార్ ప్రకటించినా కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాలు ఏర్పాటు చేసి నెలన్నర దాటుతున్నా ఇప్పటి వరకు ఒక్క బస్తా ధాన్యం రాకపోవడం గమనార్హం. ఏ కొర్రీలు లేకుండా ప్రైవేట్ వ్యాపారులు పొలాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల వైపు కర్షకులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

- ప్రైవేట్ వైపే రైతుల మొగ్గు
- నిబంధనలే అమ్మకాలకు అడ్డంకి
- పచ్చి ధాన్యమే కొంటున్న దళారులు
- మద్దతు ధరకు మించి చెల్లింపు
- తప్పుతున్న రవాణా, ఇతర ఖర్చులు
- బోసిపోతున్న కొనుగోలు కేంద్రాలు

12 కొనుగోలు కేంద్రాలు

05 ధాన్యం రాని కేంద్రాలు

మండలాల వారీగా ధాన్యం రాని కేంద్రాలు

- కేశంపేట మండలం తొమ్మిది రేకుల, కొత్తపేట
- చౌదరిగూడ మండల కేంద్రం
- నందిగామ మండలం చేగూరు
- ఫరూక్‌నగర్ మండలం ఎలికట్టె కేంద్రాలు



చౌదరిగూడ: లాల్‌పహాడ్‌లో ప్రైవేటు కొనుగోళ్లు

షాద్‌నగర్/ చౌదరిగూడ/ కేశంపేట నవంబరు 29: షాద్‌నగర్ నియోజకవర్గంలో వ్యవసాయ అధికారులు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలో ఒకటి, నందిగామ మండలం చేగూరులో ఒకటి, కేశంపేట మండలంలో మూడు, కొందుర్గు, చౌదరిగూడ మండలాలలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు కొందుర్గు, చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిరి కొనుగోలు కేంద్రంలో 9 మంది రైతులు 1160 బస్తాలు, కొందుర్గు మండల కేంద్రంలోని

మిగతా 6వ పేజీలో...



శివాలయాల్లో కార్తీక పూజలు

యాచారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక చివరి శుక్రవారం కావడంతో యాచారం మండలంలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నందీశ్వరాలయం, శివాలయం, ఓంకారేశ్వరాలయం, తక్కళ్లపల్లి గుట్టపై వెలిసిన శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, రుద్రహోమం, రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పార్వతీమాతకు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమాలలో పి.రవీందర్‌గుప్త, నారాయణరెడ్డి, సతీష్, వెంకటరెడ్డి తదితరులున్నారు.

రైతు పండగను విజయవంతం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు పండగను విజయవంతం చేయాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న రైతు పండుగకు శనివారం షాద్‌నగర్, కల్వకుర్తి ప్రాంతాల నుంచి రైతులను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు 95 బస్సులు, మహిళా రైతులకు 45 బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ బస్సుకు ఒక లైజన్ అధికారి, ఒక కానిస్టేబుల్‌ను నియమించాలని తెలిపారు. రైతులకు తాగునీరు, భోజన వసతి, వారికి కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని సూచించారు.

ప్రజా విజయోత్సవ కార్యక్రమాలపై..

డిసెంబరు 1వ తేదీ నుంచి 9వ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలకు సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయి, మండల స్థాయి, మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు ఎంపీడీవోలు, కమిషనర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు.

సర్వే డాటా ఎంట్రీ వేగిరం

కుటుంబ సర్వే డాటా ఎంట్రీ కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని, వెనుకబడిన మండలాల్లో ఆదివారం వరకు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలి

- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంషాబాద్ ఒయాసిస్ పాఠశాలలో 52వ జిల్లా స్థాయి పాఠశాల వైజ్ఞానిక, 12వ ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 400 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాపట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోగ పద్ధతిని అలవర్చుకొని మేధావులుగా ఎదగాలని సూచించారు. విద్యారంగంలో జిల్లా మార్గదర్శకంగా నిలవాలని కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత వేల సంవత్సరాల నిరంతర నిర్విరామ కృషితో సాధ్యపడిందన్నారు. ఇలాంటి లక్షణాలను విద్యార్థులు పుణికిపుచ్చుకోవాలన్నారు. శాసనమండలి సభ్యుడు ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సైన్స్ అంటేనే తెలుసుకోవడమని, ఒక చిన్న ప్రశ్న నుంచే ఎంతో మేథోమదనం జరిగి కొత్త ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయన్నారు. ఇలాంటి విశ్లేషణాత్మకతను బాల్యదశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల మేధస్సు పెరుగుతుందన్నారు. డీఈఓ సుశీందర్‌రావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో గణిత, వైజ్ఞానిక, పర్యావరణ ప్రాజెక్టులు ఇప్పటి వరకు 365 నమోదయ్యాయని, 82 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు ప్రదర్శించినట్లు తెలిపారు. ఓయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సి పాఠశాల ప్రిన్సిపాల్ యం.ఉమాదేవి మాట్లాడుతూ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు తమ పాఠశాలను ఎంపిక చేయడం పట్ల విద్యాశాఖకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం ముఖ్య అతిథులు ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించి ప్రాజెక్టులను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్‌రావు, ఎంఈవోలు కిషన్‌నాయక్, క్రిష్టయ్య, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాలు



ఆమనగల్లు , నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన, పట్టు పరిశ్రమ పంటల సాగుకు ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలను రాయితీపై అందిస్తుందని మండల ఉద్యాన వన శాఖ అధికారి సౌమ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం రాయితీపై స్ప్రింక్లర్ సెట్‌లను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాయితీ పోను రైతు వాటా రూ. 7500 డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. డ్రిప్‌పై ఎస్సీ, ఎస్టీలు వంద శాతం, ఇతరులకు 80-90 శాతం రాయితీ అందిస్తుందని తెలిపారు. కడ్తాల మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి 4
పాల్మాకుల కేజీబీవీలో సందడి చేసిన సినీ నటుడు సోనూసూద్

హనీ ట్రాప్ నిందితుల అరెస్టు 4
ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయంటూ పిలిపించి రియల్టర్ కిడ్నాప్

పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి 6
సమరానికి సన్నద్ధమవుతున్న పార్టీలు
రిజర్వేషన్లపై ఆశావహుల చర్చలు



మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న డీపీవో లక్ష్మీనారాయణ

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

మహేశ్వరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించొద్దని, నాణ్యతతో అందించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సరిపోను భోజనం అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంత వరకు అయ్యిందని, పాఠాలు అర్థమవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ కల సాకారం

రాష్ట్రం ఉన్నంతకాలం ఆయన ఉంటారు

- రాజకీయ చతురతతో అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- శంషాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న సబితారెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ కల సాకారమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు కేసీఆర్ పేరు

మిగతా 6వ పేజీలో...

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న సోనూసూద్

శంషాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవాలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని సినీ నటుడు సోనూసూద్ పిలుపునిచ్చారు. శంషాబాద్ మండల పరిధిలోని పాల్మాకుల కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో సామాజికవేత్త పట్టణానికి చెందిన సిద్ధురెడ్డి సొంత నిధులతో వంట గది, మూత్ర శాలలు, తాగు నీరు కోసం నల్లాలు ప్లే గ్రౌండ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోనూసూద్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మిత్రుడు సిద్ధురెడ్డిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంతో మంది ధనవంతులు ఉన్నా పేదలకు సహాయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమాజానికి తమ వంతు సహాయం చేస్తే ప్రభుత్వ పాఠశాలలు మెరుగు పడుతాయన్నారు. సిద్ధు రెడ్డి మాట్లాడుతూ తన సంపదలో కొంత సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో సోనూసూద్ సెల్ఫీలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పోలీస్ యూనిఫాం, గన్, సెల్‌ఫోన్లు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

హనీట్రాప్ నిందితుల అరెస్ట్

- ప్లాట్లు ఉన్నాయంటూ పిలిచి రియల్టర్ కిడ్నాప్
- రూ.3 కోట్లు డిమాండ్.. రూ.20లక్షలకు ఒప్పందం
- కేసును ఛేదించిన పోలీసులు.. ఐదుగురి రిమాండ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో హనీ ట్రాప్ ద్వారా ఓ వ్యాపారవేత్తకు వలవేసి కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన ఐదుగురు నిందితులను ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 21న జరిగిన ఈ ఘటన వివరాలు ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి వెల్లడించారు. మండలంలోని చెర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన కొరివి ధన్‌రాజ్ (42) ఎంబీబీఎస్ చదువును మధ్యలో వదిలేశాడు. అనంతరం రియల్ ఎస్టేట్ రంగంలో రాణించాలని తన తల్లి పేరుతో ఉన్న ఆరెకరాల భూమిని సోదరులకు తెలియకుండా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అక్కడి నుంచి తన మకాంను వనస్థలిపురం పరిధి వైదేహీనగర్‌కు మార్చాడు. తనకున్న భూమిలోంచి రెండెకరాలు విక్రయించి రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలెట్టాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సులువుగా డబ్బు సంపాదించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నంకు చెందిన వస్త్ర వ్యాపారి, రియల్టర్ రచ్చ నారాయణను టార్గెట్ చేశాడు.

ఐదుగురితో కలిసి కిడ్నాప్

అనుకున్నట్లుగానే ముందుగా ఎస్సై యూనిఫాం, షూస్, డమ్మీ పిస్టల్, ఓ కత్తిని కొనుగోలు చేశాడు. తనకు పరిచయమున్న సికింద్రాబాద్ మౌలాలికి చెందిన బ్యూటీషియన్ మక్కల భవాని(27)తో ఫోన్ చేయించి తమ వద్ద ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయని ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగులూరు దగ్గర మెట్రో సిటీకి రావాల్సిందిగా కోరగా ఈ నెల 21న నారాయణ అతని డ్రైవర్ ముజిబ్‌ఖాన్‌తో కలిసి కారులో వెళ్లారు. అక్కడ తన మేనల్లుడైన శివకుమార్ (26), అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌కు చెందిన సుర్వి శేఖర్ (33), ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడకు చెందిన దేరంగుల శ్రీకాంత్ (26)లతో కలిసి కారులో నారాయణతోపాటు డ్రైవర్ ముజిబ్‌ఖాన్‌ను కిడ్నాప్ చేశారు. వారి ముఖాలకు నల్లటి ముసుగులు వేసి 45 నిమిషాలసేపు కారులో తిప్పి ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న ఓ వెంచర్లో ఉన్న గదికి తీసుకెళ్లారు. అక్కడ ఎస్సై డ్రెస్‌లో ఉన్న ధన్‌రాజ్ నారాయణకు తుపాకి పెట్టి బెదిరించాడు.

బాండ్‌పేపర్‌పై సంతకాలు

ఆ అమ్మాయిలతో నీకు అక్రమ సంబంధం ఉన్నట్లు ఫొటోలు, వీడియోలు తమ దగ్గర ఉన్నాయని, రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర అంత డబ్బు లేదని చెప్పగా చివరగా బేరమాడి రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. రెండు రోజుల్లో డబ్బు సర్దుబాటుచేసే విధంగా ఓ బాండ్ పేపరుతోపాటు రెండు తెల్లటి పేపర్లపై నారాయణ సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నారు. ఆ తర్వాత మేం నిజమైన పోలీసులం కాదని పోలీసులకు చెబితే చంపుతామంటూ బెదిరించారు. ఆ తర్వాత కారులో కొంతదూరం తీసుకెళ్లి నారాయణతోపాటు డ్రైవర్‌ను వదిలేశారు. ఇదే విషయమై నారాయణ ఈ నెల 23న ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షణలో ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకొని, కిడ్నాప్‌కు ఉపయోగించిన కంట్రీ గన్, ఓ కత్తి, పోలీస్ యూనిఫాం, ఏడు సెల్‌ఫోన్లు, కారుతోపాటు బాండ్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరిత గతిన ఛేదించిన సీఐ రాఘవేందరెడ్డి, ఎస్సైలు రాజు, వెంకటేష్ వారి సిబ్బందిని డీసీపీ సునీతారెడ్డి అభినందిచారు.

పాఠశాలల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి

కులకచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీలు చేసినంత పనులకు బిల్లులు చెల్లించామని అధికారులు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టగా, చేసిన పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందలేదని పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు చేసిన పనులు, రికార్డులనడ డీఆర్‌డీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ ఉమేశ్‌కుమార్ పరిశీలించారు. చేసిన పనులకు సంబంధిత అధికారులు రికార్డు చేసి బిల్లులు చెల్లించాలని తెలిపారు. పనులకు ఎక్కువ ఖర్చు చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, ఏపీవో చంద్రశేఖర్, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు భేష్

మోమిన్‌పేట్ పీఎస్‌ను పరిశీలించిన ఎస్పీ నారాయణరెడ్డి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

మోమిన్‌పేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో గత మూడు సంవత్సరాల్లో నమోదైన వివిధ కేసులు, రికార్డులను పరిశీలించారు. ఈ సంవత్సరం నేరాల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. పోలీసుల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలు, తదితర సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిసెంబర్‌లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నందున దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని సీఐ నవీన్‌కుమార్‌కు సూచించారు. సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గన్‌లైసెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి గన్‌లైసెన్స్ హోల్డర్‌లను చెక్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో అవి డిపాజిట్ చేసేలా చూడాలన్నారు. పెట్రోల్ బంకు లైసెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి అన్నీ పెట్రోల్ బంకు యజమానులతో మాట్లాడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అరవింద్, అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కోర్టులో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో పోలీసులు సహకరించాలని కోరారు. చిన్న చిన్న తగదాలు, మోటారు వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఇతర కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు చంద్రకిషోర్, శీతల్, శ్రీకాంత్, శృతిదూత, పీపీ సమీనా బేగం, డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సీఐలు బీమ్ కుమార్, రఘురామ్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ కుమార్, పోలీసులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

లంబాడీల పోరాటంతోనే ఫార్మా కారిడార్ భూసేకరణ రద్దు


రాంబల్‌నాయక్‌తో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై లంబాడీలు చేసిన పోరాట ఫలితంగానే ఫార్మాసిటీ భూసేకరణ రద్దు చేశారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ తెలిపారు. భూసేకరణను విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయగానే శుక్రవారం షాద్‌నగర్ లంబాడి హక్కుల పోరాట సమీతి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలకు దారదత్తం చేయడానికి లంబాడీల భూములను లాక్కుంటామంటే ఊరుకుంటామా అని ప్రశ్నించారు. లంబాడీల భూములను లాక్కోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టినా లంబాడీల పోరాటం మాత్రం ఆగలేదన్నారు. భూసేకరణను రుద్ద చేసిన ప్రభుత్వం లంబాడీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్‌ఎచ్‌పీఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, చందునాయక్, మోహన్‌నాయక్, బాబురాజ్‌నాయక్, రవినాయక్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కడ్తాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముద్విన్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వారు సందర్శించారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో ప్రభుత్వం డబ్బు రైతుల ఖాతాల్లో వేస్తుందన్నారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, స్థానిక నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

సాగు విధానంపై రైతులకు అవగాహన

పలుగుట్టలో హార్టికల్చర్ విద్యార్థుల పర్యటన



పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు సాగువిధానంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత క్షేతస్థాయిలో పంటల సాగులో భాగంగా వారు పలుగుట్ట గ్రామాన్ని సందర్శించామన్నారు. ఇందులో భాగంగానే గ్రామ పటం, నేల రకాలు, పంటల సాగు శాతం, రకాల శాతం, పూలసాగు విస్తీర్ణం, పంట మొబిలిటీ మ్యాప్ తదితర వాటిని విద్యార్థులు ప్రదర్శించి, గ్రామంలోని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, రైతులు తదితరులు ఉన్నారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి

లేకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తాం : జేఏసీ



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పంచాయతీ ఎన్నికలకు బహిష్కరిస్తామని జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్ హెచ్చరించారు. తొమ్మిది పంచాయతీలను కలిపి వెంటనే గట్టిప్పలపల్లి ని మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 28వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు ఎంతటి పోరాటానికైన వెనకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, రంగారెడ్డి, లక్ష్యనాయక్, వెంకట్ రావు, జంగయ్య, హుస్సేన్, రామచంద్రి, లింగయ్య, చెన్నయ్య, దాసు, తానేశ్, రామస్వామి, మోహన్ రెడ్డి, వినోద్‌బాబు, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన తప్పనిసరి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆమనగల్లు , నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రజలు భాగమవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ అధికారి డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర పిలుపునిచ్చారు. ఈ వ్యాధి ప్రమాదకరమైనది కాదని, ఇది ఒకరి నుంచి మరొకరికి సంక్రమించేది కాదని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర ప్రారంభించారు. సర్వే, కుష్ఠువ్యాధి అనుమానితులను గుర్తించే విధానంపై శిక్షణ ఇచ్చారు. డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు ఆమనగల్లు మండలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మంజులా దేవి, షైమూన, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, యూనియన్ నాయకుడు కర్నాటి సాయిరెడ్డి, వైద్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

35,640 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తి

తాండూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 35,640 క్వింటాళ్ల 40 కిలోల ధాన్యం కొనుగో లు చేసినట్లు తాండూ రు డీసీఎంఎస్ ఇన్‌చార్జి ఎల్లప్ప తెలిపారు. ఆయన శుక్రవారం బెల్కటూర్ కొనుగోలు కేంద్రాని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా సన్న వడ్లు కొనుగోలు చేసేందుకు బెల్కటూర్, యాలాల మండల పరిధిలో యాలాల, బషీరాబాద్ మండల పరిధిలో కాశీంపూర్, పెద్దేముల్ మండల పరిధిలో మంబాపూర్‌లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు అన్ని కేంద్రాల ద్వారా 726 మంది రైతుల వద్ద నుంచి 98,101 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కాగా, 499 మంది రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. సన్నరకాల వడ్లను కొనుగోలు చేసే కొనుగోలు కేంద్రం వద్ద ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. శుభ్రం చేసిన వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320లతోపాటు రూ.500లు బోనస్ అందిస్తున్నామని, దొడ్డురకం ధాన్యానికి రూ.2,320లు లెక్కన రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ ప్రతినిధి భాస్కర్, రైతులు ఉన్నారు.

అధిక తాగునీటి చార్జీల వసూలుపై నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా తాగు నీటిపై అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయడంపై ఆదిబట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పంచాయితీగా ఉండగా తాగునీరు ఉచితంగా వచ్చేదని మున్సిపాలిటీ ఏర్పాటు తరువాత వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తరువాత కనీసం ఒ క్క పైపులైన్ కూడా కొత్తగా ఏర్పాటు చేయకుండా వేలల్లో బిల్లు చెల్లించమనడం ఏమిటని అధికారులను నిలదీశారు. అనంతరం ఆదిభట్ల మున్సిపాలిటీ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె సాయిబాబ గౌడ్, టింగ్లీకర్ రాజు, భూపతిగళ్ల అశోక్, ప్రభాకర్, జంగయ్య, కోరే శివ కుమార్, కృష్ణ, జై శంకర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి దాయర చెరువుపై 'హైడ్రా'కు ఫిర్యాదు

కీసర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కీసర మండలం, రాంపల్లి దాయర చెరువు పరిధిలో జరిగిన ఆక్రమణలపై శుక్రవారం కందాడి అంజిరెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. రాంపల్లి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 457/1/ఆలో 2 ఎకరాల 17 గుంటల చెరువును ఆక్రమించి మట్టితో నింపి ప్రీ కాస్ట్ వాల్ నిర్మించారని తెలిపారు. ఆక్రమణలపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.



పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్యం

- తొమ్మిది రోజుల పాటు నిర్వహణకు ప్రణాళిక
- రేపటి నుంచి ప్రారంభం
- కార్మికులకు కిట్లు, ఆరోగ్య శిబిరాలు
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

తాండూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. స్వచ్ఛ పట్టణంగా మార్చు తేవాలనే ఉద్దేశంతో తొమ్మిది రోజుల పాటు పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు పకడ్బందీగా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబర్ 1 (రేపటి) నుంచి వార్డుల వారీగా ఈ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు మున్సిపాలిటీలో మున్సిపల్ శాఖ వార్డుల వారీగా అధికారులను నియమించారు. అలాగే ఇందుకు అవసరమైన సామగ్రిని ముందుగానే సమకూర్చాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 1నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

డిసెంబర్ 3వ తేదీన అర్బన్‌డే

ఈ ప్రత్యేక కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయుటలో భాగంగా మున్సిపల్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 3న అర్బన్ డే పురస్కరించుకొని మున్సిపల్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అభివృద్ధి పనులు, ఇందిరా మహిళ శక్తి యూనిట్లకు చేపట్టనున్నారు. అలాగే ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలను చేపడుతారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి కింద ఇందిరా మహిళ శక్తి, స్ట్రీట్ వెండర్లకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఇందిరా మహిళ శక్తి స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అలాగే స్థానికంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి స్థానికంగా ఉన్న కళాకారులను గుర్తిసారు. పారిశుధ్యం, పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని చేపడుతారు. వాటర్ బాడీలు, దేవాలయాలు, ఉద్యాన వనాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, మతపరమైన ప్రదేశాలు , పర్యాటక కేంద్రాలు, పార్కులు వంటి జనసమూహ ప్రదేశాలను ఒక్కోక్క రోజు ఒక్కో ప్రదేశం వద్ద శుభ్రం చేసేందుకు ప్రణాళికలు చేస్తారు. ఇందులో ప్రధానంగా శుభ్ర పరిచే కార్యక్రమాలు చేపడుతారు. డిసెంబర్ 3న పబ్లిక్ టాయిలెట్లు, పాఠశాలలో స్పెషల్ శానిటైషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ..

మున్సిపల్ కార్మికులకు ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తారు. పీపీఈ కిట్లను ఈ ప్రోగ్రాంలో అందజేస్తారు. ప్రత్యేకంగా కార్మికులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తారు. ప్రజా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ఈ కార్యక్రమంలో ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపడుతారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు మున్సిపల్ శాఖ అధికారులు విద్యుత్, పోలీస్, హెల్త్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వంటి విభాగాలతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఈ నెల 30 లోపల కార్యచరణను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

క్లస్టర్ల వారీగా సూపర్‌వైజర్ల నియామకం

కార్యకలపాలు చేపట్టేందుకు వార్డుల వారీగా నోడల్ అధికారులను నియమించడం, పర్యవేక్షించేందుకు క్లస్టర్ల వారీగా సూపర్ వైజర్లను నియమిస్తూ కేటాయించిన వార్డులను పర్యవేక్షించడం, రిపోర్టింగ్ చేయనున్నారు. వార్డులలో చెత్త వల్నరబుల్ పాయింట్లను గుర్తించడం, మురుగు కాల్వల పరిస్థితి, ప్రధాన రహదారులు, వీధులను గుర్తిస్తారు. ప్రతీరోజు వార్డులలో పారిశుధ్యంతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపడుతారు. వాణిజ్య ప్రాంతాలలోని చెత్త డబ్బాలను శుభ్రం చేయిస్తారు. రోడ్డు మార్జిన్‌లపై వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసేందుకు ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేస్తారు.

కాంగ్రెస్‌లో చల్లారని ఫ్లెక్సీ చిచ్చు

- చింపిన వారిని వదలమంటున్న నేతలు
- గుప్పుమంటున్న గ్రూపు రాజకీయాలు
- సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధిష్ఠానం



ఇటీవల మేడ్చల్ రింగ్ రోడ్డు సమీపంలో చింపిన ఫ్లెక్సీ..

మేడ్చల్ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చింపిన వ్యవహారం కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చు పెట్టింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న నేతలు ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించే పనిలో పడ్డారు. మరి కొందరు వీలుంటే పోలీసుల సాయం తీసుకుని వారిపై చర్యలు తీసుకోవటానికి సిద్ధమవుతున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం, గ్రంథాలయం చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఇద్దరు మంత్రులు, ఇతర బడా నేతలు విచ్చేస్తున్నదున వారి స్వాగతం కోసం స్థానిక కాంగ్రెస్ నేతలు మేడ్చల్ జాతీయ రహదారి పరిసరాల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు. కాగా, వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చింపిన విషయం విధితమే. ఈ చర్యకు సొంత పార్టీ వారే పాల్పడ్డారంటూ ఒక వర్గం నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. కాగా, కార్యక్రమానికి మంత్రులు, ప్రముఖులు హాజరు కాలేదు. దీంతో తీవ్ర నిరుత్సాహానికి గురైన నేతలకు ఫ్లెక్సీలు, కటౌట్‌లు చించడం మరింత మనస్తాపానికి గురిచేసింది. దీంతో ఈ వ్యహారాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకు పోవడానికి ఆ వర్గం నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు

వదలమంటున్న ఒక వర్గం నేతలు

ఫ్లెక్సీల వ్యవహారంతో గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయట పడ్డాయి. ఈ విషయమై అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఫ్లెక్సీల ఏర్పాటులో ప్రొటోకాల్ పాటించ లేదంటూ స్వయాన జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి బహిరంగంగా ఆరోపణ చేయటంతో పాటు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. నేతల మధ్య సమన్వయం, సఖ్యత లేని కారణంగా ఇలాంటి పరిస్థితులు తలేత్తుతున్నాయని కొందరు నేతలు అవేదన వ్యక్తు చేస్తున్నారు. పార్టీలో గ్రూపు రాజకీయలను ప్రోత్సహిస్తున్న నేతల కారణంగా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. కుల రాజకీయాలతో కొందరు చిచ్చు పెడుతుండగా ఆధిపత్యం కోసం మరి కొందరు పార్టీలో గ్రూపు రాజకీయాలను ప్రోత్స హిస్తున్నారంటూ కొందరు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కాగా ఇక్కడ వార్డు నేతకూడా సీఎం రేవంత్ రెడ్డి పేరు చెప్పుకుని పెత్తనం చెలాయిస్తున్నందున ఈ పరిస్థితి దాపురించిందని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా వంగేటి



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న టీచర్స్

కీసర నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా టీచర్స్ కో-ఆపరేటివ్ డైరెక్టర్‌గా వంగేటి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ కో-ఆపరేటివ్ నిబంధనల ప్రకారం శుక్రవారం జరిగిన సొసైటీ ఎన్నికల్లో కీసర మండలం, యాద్గార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వంగేటి వెంకట్‌రెడ్డి డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డిని సన్మానించి అభినందించారు.

దామగుండం అగ్నిప్రమాదంపై ఆరా

డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, పరిగి సీఐ పరిశీలన



మంటలు అంటుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై అధికారులు విచారణ జరిపారు. శుక్రవారం డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదనరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణ, ఎఫ్ఆర్‌వో శ్యామ్, నేవీ అధికారి జీఎం.రావులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపుగా 20ఎకరాల్లో అటవీ ప్రాంతంలో గడ్డికి నిప్పంటుకుని కాలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో పెద్ద చెట్లకు ఎలాంటి నష్టం జరగలేదని వారు తెలిపారు. మంటలు అంటుకోవడంపై ఆకతాయిలే కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మంటలు అంటుకునేందుకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. అనంతరం అక్కడున్న స్వామిజీ ఆశ్రమాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలో ఆశ్రమం ఎంత స్థలంలో కొనసాగుతుందనే దానిపై విచారించారు. అయితే ఈ భూమి అటవీ ప్రాంతంలోకి వస్తే భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని అధికారులు ఆశ్రమంలో ఉండే స్వామిజీకి తెలిపారు.

గడ్డి భూముల్లో మంటలు ఏర్పడే అవకాశం

దామగుండం అడవిలో గురువారం రాత్రి గడ్డి భూమికి నిప్పంటుకుందని డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే 9.30గంటల సమయంలో ఫారెస్ట్, రెవెన్యూ, ఫైర్, నేవీ సిబ్బంది దామగుండం చేరుకోగా, అప్పటికే మంటలు ఆర్పివేసిన ప్రాంతాలు కనిపించాయని తెలిపారు. సహజంగానే గడ్డి భూములు దామగుండంలో ఎక్కువగా ఉండటం వల్ల ప్రతీ ఏడాది ఏదో ఒక చోట మంటలు ఏర్పడుతుంటాయని డీఎఫ్‌వో పేర్కొన్నారు. అది కూడా మానవ తప్పిదాల వల్లనే ఈ మంటలు రాజుకుంటాయన్నారు. డిసెంబర్ నుంచి మే వరకు గడ్డి భూముల్లో మంటలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఫారెస్ట్, నేవీ సిబ్బంది అడవిలో గస్తీ తిరుగుతూ మంటలు ఏర్పడిన వాటిని గుర్తించి ఆర్పే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు చోటు చేసుకోకుండా పూర్తి చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీడీఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి పురపాలక పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్ టీ కే శ్రీదేవి ప్రజా పాలన విజయోత్సవాలపై అదనపు కలెక్టర్లు, మెప్మా పీడీలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడారు. విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 3వ తేదీన జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహించాలన్నారు. మునిసిపాలిటీ పరిధిల్లో సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ దీపాలతో ప్రధాన కూడళ్ల కార్యాలయాలను అలంకరించాలని ఆయన తెలిపారు. మహిళా సంఘాల గ్రూపులకు రుణాల చెక్కులను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, విక్రమ్ సింహారెడ్డి, వెంకటయ్య, బలరాంనాయక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్లు వెంకటేశ్, రాజేంద్రప్రసాద్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఆర్వో సంక్షేమ సంఘం నేత ఉపేంద్రరావు

డిసెంబర్ 1న వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం

శామీర్‌పేట, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 1న రాష్ట్ర స్థాయిలో వీఆర్వోలు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారులు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంటలో వీఆర్వోల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొఘుల్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు, అత్యధిక సంఖ్యలో తప్పనిసరిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో ఎమ్మెస్ నంబర్ 29 ద్వారా వీఆర్వో వ్యవస్థను రద్దు చేయబడిందన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 121 ద్వారా వీఆర్వోలను అర్ధరాత్రి వేళ లాటరీ పద్ధతి ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలకు విరుద్ధంగా ఇతర శాఖల్లోకి, అటానమస్ బాడీల్లోకి బలవంతంగా సర్దుబాటు చేసినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనంలో వివిధ అంశాలపై, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నటు వివరించారు. సమ్మేళనానికి రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మోహన్, జిల్లా అధ్యక్షుడు దేశ్‌పాండే, నాయకులు మాణిక్యం, సత్యం, కిశోర్‌కుమార్, మన్నె గణేష్, లక్ష్మణ్‌రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వికారాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ, హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో కూడా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగాయన్నారు. మూడు రోజులుగా మళ్లీ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులనే టార్గెట్ చేసుకుని దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసను ఆపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి డిసెంబర్ 1(రేపటి) నుంచి బైక్ ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య తెలిపారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఏటీ కాంప్లెక్స్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువురు నాయకులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటి వరకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరిస్తూ, వారిలో చైతన్యం తీసుకురావడానికి ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ర్యాలీ షాద్‌నగర్ నియోజక వర్గంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, కె. మనోహర్‌రెడ్డి, అమడాపురం నర్సింహ గౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, ప్యాట అశోక్, వెంకనోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి

- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయాలు
- ఎత్తుగడలు ప్రారంభించిన ఆశావహులు
- అగ్రనేతల ప్రాపకం కోసం పాకులాట!
- రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆందోళన
- స్థానిక సమరానికి సన్నద్ధమవుతున్న పార్టీలు

ఆమనగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని గ్రామాల్లో క్రమంగా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రానున్న సంక్రాంతికి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి ఫిబ్రవరి 2వ వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా స్థానిక ఎన్నికల చర్చే నడుస్తోంది. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులపై ఆశలు పెంచుకున్న మండల, గ్రామస్థాయి నాయకులు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. వారి వారి పార్టీల అగ్రనేతల ప్రాపకం కోసం బరిలోనిలిచే నేతలు ఎత్తుగడలు సాగిస్తున్నారు. మరోవైపు ఈసారి ఎన్నికల నిర్వహణకు ఖర్చు కూడా బాగానే అవుతుందని అంచనాకు వచ్చిన కొందరు నేతలు.. అప్పుడే అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. అధికార యంత్రాంగం ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లలో సన్నద్ధమైంది. ఈమేరకు జనవరి 14న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పార్టీల నేతలు భావిస్తున్నారు.

రిజర్వేషన్లపై ఆందోళన!

సమగ్ర కులగణన సర్వే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు అమలు చేయాలని



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

ప్రభుత్వం భావిస్తోంది. అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. పంచాయతీ వార్డులు మొదలుకొని జడ్పీ చైర్మన్ స్థానం వరకు రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. కులగణన నేపథ్యంలో బీసీలకు అన్ని స్థాయిల పదవుల్లో రిజర్వేషన్లు పెరిగే అవకాశముంది. దాంతో ఆ సామాజికవర్గం వారు బరిలో నిలిచేందుకు అప్పుడే ఉత్సాహం కనబరుస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులపై ఆశలు పెట్టుకొని వివిధ ప్రధాన పార్టీల్లో ఏళ్లకాలంగా ఉత్సాహంగా పనిచేస్తూ డబ్బు ఖర్చుకు వెనుకాడకుండా ముందుకెళ్లే నేతలు రిజర్వేషన్లు మారితే తమకు అవకాశం దక్కుతుందో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా సర్పంచ్ పదవికి పార్టీ బీఫామ్ కూడా ఉండదు కాబట్టి.. ఎక్కువ మంది పోటీపడి బరిలో నిలిచే అవకాశం ఉంటుంది. ఈనేపథ్యంలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తే గ్రామ స్థాయిలో వివాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని, ఈమేరకు పలు ఇబ్బందులు తప్పవన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

ప్రజాప్రతినిధులు లేక పడకేసిన పాలన

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 2024 జనవరి 31న, జిల్లా, మండల పరిషత్‌ల పదవీకాలం జూలై 4న ముగిసింది. గత 10 నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకపోవడంతో నెలల కాలంగా గ్రామాల్లో అభివృద్ధి కొంతమేర కుంటుపడింది. పంచాయతీ సిబ్బందిపై కూడా పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు ఒకింత భారంగా మారింది. మరోవైపు స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. గ్రామ పంచాయతీలకు, అన్ని మండలాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కాగా, గరిష్ఠంగా మూడు నెలలకు మించి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగరాదనే నిబంధన ఉంది. దాంతో స్థానిక ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి అనివార్యమైంది. వచ్చే జనవరిలో నోటిఫికేషన్ వేసి ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

నాలుగు మండలాల్లో 102 పంచాయతీలు

ఆమనగల్లు మండలంలో 13, మాడ్గులలో 33, కడ్తాలలో 24, తలకొండపల్లిలో 32 గ్రామా పంచాయతీలున్నాయి. అదేవిధంగా నాలుగు మండలాల పరిధిలోని 41 ఎంపీటీసీ స్థానాలున్నాయి. గత ఎన్నికల్లో ఆమనగల్లు, కడ్తాల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఎస్టీలకు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. అప్పట్లో నాలుగు మండలాల ఎంపీపీ స్థానాలు రిజర్వేషన్లలో భాగంగా మహిళలకే కేటాయించడం జరిగింది. ఈసారి ఎలా ఉంటుందోనని రాజకీయ చర్చ సాగుతోంది. మరోవైపు స్థానిక సమరానికి ప్రధాన రాజకీయ పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి.

బీఆర్ఎస్, రైతుల పోరాటంతోనే దిగొచ్చిన సర్కార్

షాద్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కొడంగల్ నియోజకవర్గ రైతుల తిరుగుబాటుతోనే లగచర్ల భూముల స్వాధీనంపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తొందరపాటు నిర్ణయాలతో రేవంత్ సర్కారు అభాసుపాలైందని విమర్శించారు. ఫార్మా కారిడార్ ఏర్పాటుకు రైతుల నుంచి భూములు లాక్కోవాలన్న ప్రయత్నాన్ని బీఆర్ఎస్‌తో పాటు రైతులు ఎదురు తిరగడం వల్లనే ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఇది రైతుల విజయమని, రేవంత్ సర్కారు ఇకనుంచైనా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని తెలిపారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల పోరాట ఫలితమే ఫార్మా కారిడార్ నోటిఫికేషన్ రద్దు

ఆమనగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఫార్మా కారిడార్ ఏర్పాటుకు భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం గిరిజనుల, బీఆర్ఎస్ నాయకుల నైతిక విజయమని ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ అన్నారు. గిరిజన సంఘాల పోరాట ఫలితం, బీఆర్ఎస్ ఒత్తిడితో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అనురాధపత్యానాయక్ మాట్లాడారు.

ధాన్యమేదీ?

(3వ పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రంలో 10 మంది రైతులు 2,063 బస్తాల ధాన్యాన్ని విక్రయించారు. మిగతా నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు బస్తా ధాన్యం కూడా రాలేదు.

44,542 ఎకరాల్లో వరి సాగు

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో 44,542 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 9,79, 929 క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే నియోజకవర్గ పరిధిలో 85 శాతం వరి కోతలు పూర్తయ్యాయని, 7,23,645 క్వింటాల ధాన్యం రైతుల చేతికి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం అమ్మింది మాత్రం తక్కువే. ప్రభుత్వాని పోటీగా ప్రైవేటు వ్యక్తులు రైతులకు అధిక ధర చెల్లించి పొలాల వద్దే ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

క్వింటాలుకు రూ. 3వేలు

వరి ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుంది. దీంతో పాటు నాణ్యత ప్రమాణాల బట్టి సన్నాలకు క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుంది. అయితే సర్కారు దీటుగా మిల్లర్లు నాణ్యత ప్రమాణాలను పట్టించుకోకుండా క్వింటాలు ధాన్యాన్ని రూ.2800 నుంచి రూ.3వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. తాలు, తేమ, తరుగు, గన్నీ బ్యాగుల సమస్య హమాలీ, రవాణా ఖర్చు ఏమీ ఉండదు. దీంతో రైతులు ప్రైవేటుకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం దేశ, విదేశాల్లో కూడా తెలంగాణ వరి ధాన్యానికి మంచి ఆదరణ లభిస్తుండటం, ధర కూడా ఇంతకు రెట్టింపు ఉండటంతో మిల్లర్లు ఎగబడి నేరుగా పంట పొలాలకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో వరి సాగు (ఎకరాల్లో)	
ఫరూఖ్‌నగర్	13792,
చౌదరిగూడ	6,798,
కేశంపేట	10,767,
కొత్తూరు	3,335,
నందిగామ	4,651

నిబంధనలే అడ్డంకి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలంటే ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. ధాన్యం తేమ 17 శాతానికి మించకూడదు. రాళ్లు, మట్టిపెళ్లలు, చెత్త, తాలు ఒక శాతం మించి ఉండొద్దు. దీంతో పాటు రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతానికి మించొద్దు. పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం మించకుండా ఉండాలనే అనేక నిబంధనలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇన్ని కష్టాలు పడలేమని ప్రైవేటు వ్యక్తులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ధాన్యం నాణ్యతను బట్టి క్వింటాల్‌కు రూ.2,200 నుంచి రూ.2500 వరకు ధర చెల్లిస్తున్నారు. నాణ్యత బాగుంటే రూ.2800 నుంచి రూ.3వేల వరకు ఇస్తున్నారు. ధాన్యం డబ్బులు కూడా రైతులకు వెంటనే చెల్లిస్తున్నారు.

మద్దతు ధర కంటే ఎక్కువిస్తున్నారు



ధాన్యానికి ప్రభుత్వమిచ్చే మద్దతు ధరకంటే ప్రైవేటు వ్యక్తులే ఎక్కువ చెల్లిస్తున్నారు. పచ్చి ధాన్యానికే క్వింటాల్‌కు రూ.2,200 తక్షణమే ఇస్తున్నారు. రవాణా ఖర్చులు, గన్నీబ్యాగుల ఇబ్బందులు, హమాలీ భారం ఉండదు. నాణ్యతా ప్రమాణాలు బాగుంటే రూ.500 ప్రభుత్వ బోనస్ కూడా చెల్లిస్తున్నారు.

- చౌడు శ్రీనివాస్, సంగెం

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం


షాబాద్ : గులాబీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి నాయకులు

చేవెళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని చేవెళ్ల నియోజకవర్గం ఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశమోళ్ల అంజనేయులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించి 14ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

కందుకూరు : శంషాబాద్‌లో నిర్వహించిన దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్‌చైర్మన్ చంద్రశేఖర్‌లు పార్టీ జెండాను ఎగరేసి దీక్షాదివస్‌కు తరలివెళ్లారు. మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరదేవేందర్, నాయకులు తరలివెళ్లారు.

శంకర్‌పల్లి : ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. దీక్షా దివస్ సందర్భంగా శంకర్‌పల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ జెండాను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మాణిక్‌రెడ్డి, రాజునాయక్, పాపారావులతో కలిసి ఎగరేశారు. దీక్షాదివస్ కార్యక్రమానికి తరలివెళ్లారు. మాజీ సర్పంచ్‌లు, తదితరులున్నారు.

కొత్తూర్ : దీక్ష దివస్‌కు మున్సిపాలిటీతో పాటు, మండలంలోని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్ చైర్మన్ రవీందర్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడుకృష్ణ, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్, మాదారం నర్సింహగౌడ్, సోమ్లనాయక్, కోస్గి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చౌదరిగూడ : కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, కొందుర్గు మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, ఉమ్మడి మండల నాయకులు రామకృష్ణ, జబ్బార్, బాబురావు, అక్రం, యాదయ్య, వెంకటేష్, ఇస్మాయిల్ ,రెడ్డి నర్సింహులు, రాంచంద్రయ్య తదితరులున్నారు.

కేశంపేట : దీక్షాదివస్‌కు కేశంపేట మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, తలసాని వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : కేసీఆర్ దీక్ష వల్లే ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నామని షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం శంషాబాద్‌కు తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, జడల రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, ఆరిఫ్, కమ్మరి శ్రీను, సత్యనారాయణ, దర్శన్, అంజయ్య, ముక్రంఖాన్ తదితరులున్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్‌లో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ఎంపీపీ ఆనంద్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెంకటయ్య, తులసీరామ్‌నాయక్, యాదయ్య, హరిచంద్‌నాయక్, సాయిలు, భూనాథ్, జంగయ్య, తదితరులున్నారు.

ఆమనగల్లు : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి ఆమనగల్లు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈమేరకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి నారాయణ స్కూల్‌లో శుక్రవారం జరిగిన వికారాబాద్ జోన్ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం వల్లి కుమార్, ప్రిన్సిపాల్ దివ్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అక్బర్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, పాండురంగారెడ్డి, బలవంత్‌రెడ్డి, పీఈటీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ కల సాకారం

(3వ పేజీ తరువాయి)

ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ రాష్ట్ర ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేశారని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వంలో హోంమంత్రి స్థాయిలో ఉండి దీక్ష విరమించాలని కేసీఆర్‌ను నేను కోరినా వినలేదన్నారు. "లేదమ్మా.. తెలంగాణ ఇస్తే దీక్ష విరమిస్తా.. లేదంటే నా ప్రాణాలు పోయిన పర్వాలేదని" చెప్పినట్లు గుర్తు చేశారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ అధ్వాన పాలనతో రాష్ట ప్రజలకు కేసీఆర్ విలువ తెలిసి వచ్చిందన్నారు. నవంబరు 29 కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... 69 ఏళ్ల నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడినా రానిది.. కేసీఆర్ చేసిన దీక్షతో సాధ్యమైందన్నారు. కేసీఆర్ గురించి ముందుతరం తెలుసుకోవాలని సూచించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ కారణంగా రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమని చెప్పారు. కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని, వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్, కోనమోళ్ల శ్రీనివాస్, మంచర్ల మోహన్‌రావు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

ఆమనగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 11వ వార్డులో గల ఎస్సీ(మాల) శ్మశాన వాటిక నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని కౌన్సిలర్ బైకని యాదమ్మశ్రీశైలం యాదవ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంతలకు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ నిర్మాణానికి మూడేళ్లక్రితం రూ.15లక్షలు కేటాయించినా కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో 3సార్లు రీటెండర్ వేశారని, ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదని, అదనంగా రూ.10లక్షలు కేటాయించాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మాసానిగూడలో ఆలయం వద్ద గ్రామస్తులతో ముచ్చటిస్తున్న సీఐ

శంకర్‌పల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చిలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మాసానిగూడలో శుక్రవారం సీసీ కెమెరాల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జీపీ కార్యాలయం, ఆలయం, మసీదు, తదితర ప్రాంతాల్లో తప్పక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మాజీ సర్పంచులు సంజి సత్తయ్య, రాములు తదితరులున్నారు.

మహిళలు ఒంటరిగా వెళ్లకూడదు


మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు విలువైన ఆభరణాలు, నగదుతో ఒంటరిగా వెళ్లరాదని పోలీసులు కోరారు. శుక్రవారం సాయంత్రం పోలీసులు సైకిళ్లపై యాచారం బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. బాలికలను ఎవరైనా బెదిరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచితులు అనుమానంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

మాదిగల మహాసభను విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10న ఇబ్రహీంపట్నంలో నిర్వహించతలపెట్టిన మాదిగల మహాసభను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ కోరింది. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో మాదిగ జేఏసీ నాయకుడు కొంద్రు ప్రవీణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిలుగా మందకృష్ణ మాదిగ, ప్రొఫెసర్ కాశీం, తదితర నాయకులు హాజరవుతారని ప్రవీణ్ తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలు ఆదర్శం

కందుకూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలుగా ఏర్పడిన మహిళలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచారని ఏపీఎం కవిత అన్నారు. నేదునూరుకు చెందిన మానస పొదుపు సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. 25 ఏళ్లక్రితం ఏర్పడిన సంఘం ద్వారా సభ్యులు పావలా వడ్డీతో మంజూరు చేస్తున్న రుణాలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వృద్ధి చెందారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఈ సంఘం సభ్యులు బ్యాంకు నుంచి 8సార్లు రుణసౌకర్యం పొంది అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. సభ్యులు తదితరులున్నారు.

పొరపాట్లు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి


యాచారం : డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

కేశంపేట/యాచారం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కుల గణన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. యాచారం మండలంతో పాటు 24 గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో 15808 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. సర్వే వివరాల నమోదుకు యాచారంలో 30 కంప్యూటర్లతో.. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో మరో 80 కంప్యూటర్లతో డాటా ఎంట్రీ చేస్తున్నట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. సర్వే పత్రాలను ఎంట్రీ చేయడంలో రంగారెడ్డి జిల్లాలో యాచారం మండలం మొదటిస్థానంలో నిలిచిందని ఎంపీడీవో చెప్పారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : కొత్తకుంట తండాకు చెందిన దోళి అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు కుటుంబాన్ని లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేలు సమకూర్చగా మాజీ వార్డు సభ్యుడు సురేశ్ అందజేశారు.

చౌదరిగూడ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అందరికంటే ముందుండాలంటే కష్టపడి ఇష్టంతో చదవుకోవాలని విద్యాస్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు తెలిపారు. పెద్దఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో కెరియర్ గైడెన్స్‌పై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇబ్రహీంపట్నం : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో వనభోజనాలు చేశారు. ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం తీసుకున్నట్లు డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఈ వేడుకలో పాల్గొన్నారు.

కడ్తాల్ : ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన యాట గీతా నర్సింహులకు గోవిందాయిపల్లి, న్యామతాపూర్ కాంగ్రెస్ నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గీతా నర్సింహను పూలమాలలు , శాలువాలతో సత్కరించి అభినందించారు. రమేష్, సత్తయ్య, శ్రీకాంత్, మహేశ్, పారుఖ్, జాన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఖాదర్, సాబేర్, తదితరులున్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

ఇబ్రహీపట్నం/యాచారం/మాడ్గుల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల సంక్షేమ హాస్టళ్లలో కల్తీ ఆహారం తిని మృత్యువాత పడుతున్న సంఘటనలపై సంక్షేమ హాస్టళ్లపై బీజేపీ నిరసన కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్, ఆదిభట్ల, తుక్కుగూడ మున్సిపాలిటీలకు చెందిన బీజేపీ ముఖ్యనాయకులు గురుకుల హాస్టళ్లను సందర్శించకుండా ఆదిభట్ల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ మీడియా సెల్ జిల్లా కన్వీనర్ ఉడుతల అశోక్‌గౌడ్, బడంగ్‌పేట్ కార్పొరేటర్ ఇంద్రసేన్, తుక్కుగూడ మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజు, యాదగిరి రెడ్డి, మహేందర్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు నరేష్‌లను ముందస్తుగా అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అలాగే బీజేపీ మండల ఎస్సీ, ఎస్టీ, బీసీ మోర్చా నాయకులను యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ముంత జంగయ్య, శివమోడీ, గణేష్, శ్రీనివాస్ తదితరులను అరెస్టు చేశారు. మాడ్గులలో పల్లేటి జగన్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం : వీర్లపల్లి


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రైతు ప్రయోజనాలు, సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు రైతు పండుగ నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు శుక్రవారం తరలివెళ్లారు. ఈక్రమంలో షాద్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటల భీమా పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి ప్రారంభిచడంతో పాటు, అందుకు చెల్లించాల్సిన ప్రీమియంను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిచండం హర్షణీయమన్నారు. ఆధునిక పద్దతిలో లాభసాటి వ్యవసాయం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు.

'రైతు పండగ'కు బస్సుల ఏర్పాట్లు : ఏడీఏ

చేవెళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండగ కార్యక్రమానికి చేవెళ్ల డివిజన్ నుంచి భారీ సంఖ్యలో రైతులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ రైతు పండగ కార్యక్రమానికి చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల నుంచి రైతులను ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల్లో తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. చేవెళ్ల డివిజన్ నుంచి 15 బస్సుల్లో.. 50 మంది చొప్పున తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. అన్ని మండలాల నుంచి నేడు(శనివారం) ఉదయం 9 గంటలకు బస్సులు మహబూబ్‌నగర్‌కు బయలుదేరుతాయన్నారు.

అన్నదాతల ఆర్థికాభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ

కడ్తాల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆర్థికంగా బలపడి అప్పులు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. తెలంగాణ రైతులను దేశానికి తలమానికంగా నిలుపాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతులకు భరోసా అని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఏ కష్టాలు ఉండవని ఆమె స్పష్టం చేశారు. దేశ చరిత్రలోనే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల ఖాతాల్లో 30న సీఎం చేతులమీదుగా జమచేయడం జరుగుతుందని, సంక్రాంతి నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 అందించనున్నట్లు చెప్పారు. రైతుపండగ సభకు రైతులు ఉప్పెనలా కదలాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజాపాలనను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు విషం కక్కుతున్నారని అన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, అజీం, ఎన్ఎస్‌యుఐ మండలాధ్యక్షుడు షాబోద్దీన్, యూత్ కాంగ్రెస్ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు చెన్నయ్య, శ్రీను, పవన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా రాజునాయక్


రాజు నాయక్‌కు నియామక పత్రం అందిస్తున్న రాంబల్‌నాయక్

కేశంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) కేశంపేట మండలాధ్యక్షుడిగా కంకరాళ్ల తండాకు చెందిన రాజు నాయక్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబల్‌నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాజు నాయక్‌ను ఆయన స్వగృహంలో కలిసిన రాంబల్‌నాయక్ నియమాక పత్రాన్ని అందించారు. రాజునాయక్ సేవలను గుర్తించి అవకాశం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు రాంబల్ నాయక్‌కు రాజునాయక్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ జగన్ నాయక్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి ఏడాది జైలు

యాచారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా బైక్ నడిపి ఓ వ్యక్తి మరణానికి కారకుడైనందుకు బైకిస్ట్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయాధికారి శుక్రవారం తీర్పు వెలువరించారు. తక్కళ్లపల్లి తండాకు చెందిన గాగి(50) ఆమె భర్త హనుమ(57) దంపతులు. 2019 జూన్ 11న వ్యవసాయ క్షేత్రం నుంచి హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారి వెంట నడచుకుంటూ ఇంటికి వస్తున్నారు. ఒంగోలుకు చెందిన సొరగాయల శ్రీను తన మిత్రుడైన లక్ష్మీనారాయణ వద్ద బైక్ తీసుకున్నాడు. దానిపై మాల్ వైపు నుంచి యాచారం వైపు అతివేగంగా వస్తున్నాడు. ఈక్రమంలో తక్కళ్లపల్లి తండా వద్ద గాగి, హనుమలను బైక్‌తో ఢీకొట్టాడు. దాంతో హనుమ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గాగి ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు వివరాలను కోర్టుకు సమర్పించారు. పాదచారుడి మరణానికి కారకుడైన శ్రీను(41)కు ఏడాది కారాగార శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా, లైసెన్స్‌లేని వ్యక్తికి బైక్ ఇచ్చినందుకు గాను బైక్ యజమాని లక్ష్మీనారాయణకు రూ.వెయ్యి జరిమానా విధించారు.

వైన్‌షాపునకు కన్నం.. 6 మద్యం బాటిళ్లు చోరీ

శంషాబాద్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైన్‌షాపునకు కన్నం వేసిన గుర్తుతెలియని దుండుగులు.. 6 మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లిపోయారు. పాల్మాకులలో ఎస్‌వీపీ లక్ష్మీనర్సింహ వైన్‌షాపులో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు షాపు వెనకభాగంలో గోడకు కన్నంవేసి అందులోంచి వెళ్లి 6 ఫుల్‌బాటిళ్లు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి మంకీక్యాప్ ధరించిన వ్యక్తి దొంగతనం చేసినట్లు గుర్తించినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.